









## తెలంగాణ సంస్కృతికి ప్రతీక

# బతుకమ్మ



**మెదక్, అక్టోబర్ 07 (ప్రజా స్వరం) :**
ప్రపంచంలో పువ్వులను పూజించే గొప్ప సంస్కృతి ఒక్క తెలంగాణకు మాత్రమే ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో మా ఇంటి బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ బతుకమ్మ ఉత్సవాల్లో మంత్రులు మహిళలు యువతులతో కలిసి పూలతో పేర్చిన బతుకమ్మలతో వచ్చి ఆనందంగా బతుకమ్మ ఆడారు. అనంతరం సింగర్ మంగ్లీ బతుకమ్మ ఆటపాటలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ మన సంస్కృతికి ప్రతీక అన్నారు. మెదక్ జిల్లాలో బతుకమ్మ, ఉత్సవాలు పండుగ వాతావరణంలో నిర్వహించడానికి ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు తీసుకున్న చొరవ అభినందనీయమన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తి శ్రద్ధలతో తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలు ప్రతి బింబించే విధంగా బతుకమ్మ జరుపుకుంటామన్నారు. తెలంగాణ ఉద్యమాన్ని సంఘటిత శక్తిగా మార్చడంలో బతుకమ్మ వేడుకలు ప్రత్యేక పాత్ర పోషించాయన్నారు. ప్రకృతితో మమేకం అయ్యే పండుగ బతుకమ్మ అని కొనియాడారు. తెలంగాణలో చెరువులకు బతుకమ్మకు దగ్గర సంబంధం ఉందన్నారు. మైనంపల్లి కుటుంబం సేవలు అమోఘమని కొనియాడారు. సమాజంలో ఆడపిల్లను ఎదగనివ్వండి, బ్రతకనివ్వండి మంచి సమాజాన్ని నిర్మించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఆవిడ ఆడబిడ్డలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు మైనంపల్లి హన్మంతరావు, రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ నేరెళ్ల శారద, రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బండారు శోభారాణి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత గుప్త, మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డీవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.





## మంత్రి కొండాకు ఘన స్వాగతం

మెదక్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన బతుకమ్మ సంబురాల్లో పాల్గొనడానికి విచ్చేసిన రాష్ట్ర అట వీశాఖ దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ఘన స్వాగతం లభించింది. ప్రత్యేక హెలికాప్టర్ ద్వారా మెదక్ జిల్లాకు చేరుకున్న మంత్రి కొండా సురేఖకు మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ మహేందర్ పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.









